

# యజ్ఞం

## – శేషచంద్ర

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**సావిత్రమ్మ అవాక్కయింది.** అంతలోనే తేరుకొని " ఏందిరా మీనాయన్ను అన్నేసి మాటలంటుండావు. మీ నాయన ఎట్టాంటోడో నీకు తెలవదా. మీ నాయన అందరిలాంటోడు అయింటే ఈపాటికి ఏ మంత్రో అయిండోడు. ఎన్నో కొట్లు ఎనకేసేటోడు. గుడ్డు వొచ్చి పిల్లను ఎక్కిసం మాడినట్టు మీ నాయన్నంటుండావు. అనే ముందు ఏ మాట్టాడోం సూసి అనాలా . నీ తెలివాడికి పోయినాది ఆ దినం హస్పెటెల్లో డబ్బులు ఎవరు కట్టింద్రు ఎట్టా కట్టింద్రు తెలుసుకోని .అప్పుడే కార్డు మీద ఆపరేషనొద్దని డబ్బుకట్టాల్సింది. ఇప్పుడాయన్ని ఎంతంటే అంతమాట అంటుండావ్. ఆయనకు తెలిసింటే అట్టా ఒప్పుకొనే వోడా తెలివి తక్కువా మాటలు నువ్వనూ...ముందు వాదులాటాపి , పాపం ఆ పిలగాడికి ఎట్టుంటాదో ఏమో . నీ మీద ఆసలు పెట్టుకొని నీకు ఫోను సేసినాది ఏదో ఒక సగయాం సేసిరాపో " అంది సావిత్రమ్మ..

కారు తాళం చెవులు కోసం లోపలికి పోయాడు రుద్ర .

సావిత్రమ్మను చెక్ బుక్కు తీసుకరమ్మన్నాడు ఎంకట్రెడ్డి. కారు తాళాలు తీసుకోని బైటికి వెళ్లపోతున్న రుద్ర ను

"ఆగరా వట్టి సేతుల్తో పోయి ఏం సేస్తావు ఉండు" అన్నాడు ఎక్కడో నూతిల్లోంచి వచ్చింది మాట .

"డబ్బులు నాకాడ ఉండాయిలే " అన్నాడు రుద్ర ఆగకుండా.

"నీకాడది ఎందుకులే. ఇంట్లో క్యాష్ లేదు గాని చెక్ ఇస్తా ఉండు" అంటుండగానే సావిత్రమ్మ చెక్ బుక్కు తీసుకొచ్చింది...

బ్లాంక్ చెక్ మీద సంతకం చేసిఇస్తూ "ఆ కార్డు ఉండాదని నాకు తెలీదురా. రాజేంద్ర నాకు తెలీకుండా కార్డు తీసుకొనిండంట అది అట్టా ఉపయోగపడిందని సెప్పిండు. తెలిసినాక అది ఎట్టా ఎనక్కి కట్టాలనుకొంటుడినా కాని దాని సంగతి మరిచిపోయినా.అది ఇట్టా ఉపయోగపడ్తాండాదిలే" అన్నాడు. తప్పెవరిదో తెలియకుండా మాట్లడినందుకు తండ్రి

ముఖంలోకి చూడలేక పోయాడు రుద్ర . తప్పులు చాలా మంది చేస్తారు కాని సరిదిద్దుకొనే వాళ్లు కొంతమందే . చెక్కును తీసుకొంటుంటే రుద్ర చేతులు వణికాయి “ సారీ ...నాయనా. నీకు రేషన్ కార్డు తెలిసే తీసుకొన్నావనుకొన్నా “ అన్నాడు.

“మీ అమ్మ అన్నట్టు ముందుఆడికి ఎల్లబారు . ఊరికే చెక్ ఇచ్చిరాకుండా హాస్పెటెల్కు ఎల్లి వోళ్లను చేర్పించి డాక్టరుతో మాటాడి రా “అన్నాడు రుద్ర మాటలు పట్టించుకోనట్లు.

సరేనంటూ తండ్రి మనసేమిటో తెలియకుండా మాట్లడినందుకు అపరాధభావంతో కళ్లు చెమ్మగిల్లుతుండగా వడి వడిగా బైటికి నడిచాడు రుద్ర.

పిల్లవాడికి టెస్టులు చేసారు. జబ్బు తీవంగా ఉందని వెంటనే ఆపరేషన్ చేయాలని మరుసటి రోజు ఆపరేషన్ చేస్తామని చెప్పారు. సమయానికి ఆదుకొన్నావని రుద్ర కాళ్ల మీద పడపోయింది ఆ పిల్లవాడి తల్లి . పిల్లవాడికి ఇక ఏమి కాదని ఆమెకు ధైర్యం చెప్పి , డాక్టరుకు ఓ రెండు లక్షలకు చెక్ ఇచ్చేసి పూర్తిగా నయమయేంత వరకు హాస్పెటెల్లో నే ఉంచుకోమని డబ్బుల తనే కడ్తానని చెప్పాడు. ఆ పనులన్ని పూర్తి అయ్యే సరికి రాత్రి అయ్యింది.

పూజారితో పాటు కారు ఎక్కబోతుంటే ఎవరో పిలిచినట్లున్పించి వెనుతిరిగి చూసాడు రుద్ర. చీకట్లో ఎవరో చేతులూపుతు పిలుస్తున్నారు . దగ్గరకి వచ్చాక గుర్తుపట్టాడు. అతను విలేఖరి రమణ. “ ఏమిటి మీరిలా వచ్చారు మళ్లీ నాన్న గారికి బాగలేదా?“ అడిగాడు. తను వచ్చిన కారణంచెప్పాడు రుద్ర. “చాలా గ్రేట్ బ్రదర్ మీ నాన్న మీరు మీలాంటి వాళ్లు చాలా అరుదు“అంటూ ఆప్యాయంగా కరచాలనం చేసాడు రమణ. అతనుకూడా పనిఅయిపోయింది ఇంటికే అనడంతో ముగ్గురు కడపలోనే హోటల్లో భోంచేసి బైలుదేరారు.

మైదుకూరు బై పాస్ దగ్గర నుండి టౌన్లోకి కారు మళ్లిస్తుండగా, అక్కడ లోడుతో ఉన్న ఓ లారీనాపి డ్రైవర్తో ఘర్షణ పడుతున్న పోలీసులు కనపడ్డారు. పోలీసులు లారీ వాడ్ని బెదిరించి డబ్బులేమైనా లాగుతున్నారేమోనన్న అనుమానం వచ్చిన రమణ, “రుద్ర ఓ సారి కారు అటు పోని పోలీసులు లారీ డ్రైవర్ మీద ఏదో జులుంచేసి డబ్బులు లాగుతున్నట్టుండాది. అదేందో సూద్దాం “అన్నాడు.

రుద్ర కారును బైపాస్ వైపు కు తిప్పి లారీకి దగ్గరగా ఆపేందుకు స్లో చేస్తుంటే రోడ్డు పక్కనున్న పోలీసు విజిల్ ఊపుతూ వెళ్లిపో అని సైగ చేసాడు. కాని రుద్ర కారు రోడ్డు సైడున ఆపి క్రిందికి దిగాడు. అతనితోపాటు పూజారి రమణలు దిగారు. తను పొమ్మని చెప్తున్నా కారు ఆపి దిగిన వాళ్లను చూచి రెచ్చిపోయాడు పోలీసు. తన భాషలో బండ బూతులు తిట్టుకొంటూ కారు దగ్గరికి వచ్చాడు. అతని వద్ద మందు వాసన గుప్పుమంది. “ ఏమైంది సార్ లారీ లోడ్ ఏందంటా? “ అడిగాడు రమణ.

“పో నీకెందుకు ఇవన్ని పోలీసు వ్యవహారం ఇక్కడ్నించి పోతారా లేక మిమ్మల్ని కూడా బొక్కలో తోయించాలా?“

రమణ వాడితో మాట్లడకుండా నైట్ విజన్ కెమరా బైటికి తీసి పోలీసుకు పోకస్ పెట్టూ "ఏది ఇంగ చెప్పు. "అన్నాడు.

దాంతో పోలీసు మరింత రెచ్చిపోయాడు. చేతిలో లాఠీని ఝులిపిస్తూ మీదికి రాసాగాడు. అదే సమయంలో ఏదో గొడవ జరుగుతుందని లారీ దగ్గరున్న పోలీసులిద్దరిలో ఒకడు లారీ దగ్గర్నుంచి వీళ్ల దగ్గరికి వచ్చాడు అతను రమణను గుర్తుపట్టి " కానిస్టేబుల్ కొత్తోడు లేన్నా . రాత్రి పెట్రోలింగ్ చేస్తుంటే లారీ కనపడిందిలోడ్తో కాగితాలుచూసి పంపిస్తున్నాం అంతే. మీరెళ్లండి " అని సర్దిచెప్పాడు.

ఇంకా గుర్రుగా చూస్తున్న పోలీసుకు ఫోన్ రావడంతో వచ్చిన కాల్ ను చూసి అటెన్షన్ లోకి మారిపోయి

" నమస్కారం సార్ ..... సార్ ఏం చేయలేదు.సార్ ప్రెటోలింగ్ చేస్తున్నాం. ఎవరో కారులో వచ్చి మా డ్యూటికి అడ్డుపడుతుంటే వెళ్లిపొమ్మంటున్నాం .అలాగా సార్ .....సారీ సార్ అలాగే సార్..అలాగే సార్ తప్పకుండా సార్ "అని పోన్ పెట్టేసి చెమటలు కక్కుతున్న ముఖం కర్చీఫ్తో తుడుచుకొంటూ... " రుద్ర అంటే ఎవరు సార్? . "..అన్నాడు వినయంగా.

పోలీసు బండ బూతులు తిట్టేటప్పుడు అతని నెంబరు పేరు రుద్ర సిఐకి ఫోన్చేసి అక్కడ జరిగే తంతు చెప్పేసరికి , సిఐ ఆ పోలీసుకు ఫోన్ చేసి డోస్ ఇవ్వడంతో మాట తీరుమారింది. "సారీ సార్ ఎవరో అనుకొని "అంటూ రమణ దగ్గరికి వచ్చాడు. కారులో వచ్చింది సిఐకి తెలిసిన వాళ్లని తెలియగానే ప్లేటు మార్చేసారు వాళ్లు. అప్పటికి వీళ్లెవరో తెలియని లారీ దగ్గరున్న పోలీసు" రేయ్ మర్యాదగా పదివేలిస్తావా సరే లేకుంటే నా కొడకా స్టేషన్లో వేసి కుళ్లబొడ్సాలనా " అంటూ అరుస్తున్నాడు. దాంతో సీన్ అర్ధమయింది రుద్రకు రమణకు – అది దొంగలోడో మంచిదో కాని డ్రైవర్ను పోలీసులు బెదిరించి డబ్బులడుగుతుంటే వాడు బేరంమాడతున్నాడని .

లారీ డ్రైవరు నచ్చచెప్తుంటే లారీ కాబిన్ లో కూర్చున్న మరొకడు తాగినట్లున్నాడు. అంతవరకు ఎవరికో ఫోన్ చేస్తున్న వాడు పోలీసు గట్టిగాడబ్బులు డిమాండు చేసేసరికి లారీ క్రిందికి దిగి "ఇది ఎవరి సరకునుకొంటుండావు అబ్బిరెడ్డి సార్ది సార్ పిఏకి ఫోన్ చేస్తాండా గాని ఎత్తడంలా మేమేడికి పోం గాని .ఫోన్ ఎత్తంగానే మీకే ఇస్తా మాటాడుకొండి " అంటూ తీరిగ్గా సిగెరెట్టు వెలిగించుకోసాగాడు.

అబ్బిరెడ్డి పేరు వినగానే లారీ దగ్గరున్న పోలీసు అబ్బిరెడ్డి వాళ్ల దగ్గర్నుంచి ఫోన్ వస్తే వచ్చే డబ్బులు ఎక్కడ రాకుండా పోతాయోనని డైవరు చేతిలో నోట్లను గుంజుకొని " సరే వెళ్లండి వాడ్ని ఎక్కమను. ఆమాట ముందుగానే చెప్పాలి ఇంత గొడవలేదుగా వెళ్లు వెళ్లు "అన్నాడు లాఠీతో లారీ మీద టక టకా కొడ్తూ.

" అదేంది సార్ మీ వాడు లారీని పంపిస్తున్నాడు అరవింద్ సార్ వస్తుండాడు. లారీని పోకుండా ఆపండి " అన్నాడు రుద్ర .

వాళ్లు “సార్ వస్తున్నాడా? “ అని కంగారు పడ్తూ , “అరే సాంబా లారీ అపమని చెప్పరా సిఐ సార్ వస్తున్నాడట “ అంటూ లారీ దగ్గరున్న పోలీసుకేకేసి చెప్పి వాడికి వినపడిందో లేదోనని పరుగులాంటి నడకతో పోయి లారీని ఆపి డబ్బులు తీసుకొన్న పోలీసుకు సిఐ వస్తున్న సంగతి చెప్పాడు..

లారీని మళ్లీ ఆపడంతో “ఏమైనాది సార్ పైసలు తీసుకొనింద్రు గందా మళ్లా ఆపమంటుందరు మమ్మల్ని పోనీయండి“ అన్నాడు లారీ డ్రైవరు.

కొద్ది క్షణాల క్రితమే డబ్బులు తీసుకొన్న పోలీసు అరవింద్ వస్తున్నాడని తెలియగానే “ ఎవడికి రా డబ్బులిచ్చింది నాకొడకా దొంగ లోడు తీసుకపోతా మళ్లా మాకు డబ్బులిచ్చినానంటావా?“ అని డైవర్ను సీటుల్లోంచి క్రిందికి లాగాడు.

వాడు పైనుండి బోర్ల బొక్క పడపోయి నిలదొక్కుక్కొని రెండు క్షణాల క్రితం డబ్బులు తీసుకొన్న పోలీసువైపు బిత్తర పోయి చూస్తూ నోరు మూసుకొన్నాడు, నోరెత్తితే ఎక్కడ చావగొట్తాడో అని. పోలీసు , లారీతో వాడి ముఖం మీద గుచ్చి“ నా కొడకా సిఐ సారు వస్తుండాడు మల్లా డబ్బులిచ్చినా అని కూసినావంటే కొడకా మక్కెలిరగదంతా“ అన్నాడు గొణుగుతూ ..

లారీ కాబిన్లో కూర్చున వాడికి అది చూసి మత్తుదిగిపోయింది. అబ్బిరెడ్డి పిఏ ఫోన్ చేయడంతో వాడు ఫోన్ పోలీసుకిమ్మన్నాడు “ మాదేం లేదు ఎవరో వచ్చి లారీ ఆపినారు. సిఐ సారు వస్తున్నాడు. లారీ పంపేదానికి కుదరదు . సిఐసార్ తో మీ సార్ను మాట్లడు కోమని చెప్పు“ అని ఫోన్ కట్ చేసి వాడికిచ్చాడు.

అరవింద్ అక్కడికి వస్తాడని చెప్పలేదు కాని లారీ వెళ్ళిపోతుంటే కల్పించి చెప్పాడు రుద్ర . తర్వాత పక్కకు పోయి అరవింద్ కు పోన్ చేసాడు మళ్లీ . లారీ దొంగలోడని అది అబ్బిరెడ్డిదని వెంటనే రమ్మని.

లారీలోని సరుకు దొంగలోడ్ అని తెలియగానే వెంటనే తమ తోటి విలేకర్లుకు మీడియాకు విషయం చేర వేసాడు రమణ. తెలివిగా దొంగలోడు అబ్బిరెడ్డిది అని చెప్పలేదు. అలాచెప్పిఉంటే ఎవరు ముందుకు వచ్చేవాళ్లుకాదు. అబ్బిరెడ్డికి విషయం చేరక ముందే మండలంలో ఉన్న విలేఖర్లు మీడియా వాళ్లకు అందరికి చేరిపోయింది వార్త. రుద్ర అంతా పోలీసు స్టేషన్ చేరుకొన్నారు. రాత్రి పన్నెండు గంటలవుతున్నా పోలీస్ స్టేషన్ వాళ్లతో నిండిపోయింది. అబ్బిరెడ్డికి విషయం తెలిసే సరికే కేస్ బుక్ చేసాడు అరవింద్, ఆలస్యంచేస్తే పై అధికార్లునుంచి పొలిటకల్ నాయకుల్నుంచి ఫోన్లు వస్తాయని . అతను అనుకొన్నట్లే ఎస్పీ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది, ఏదో ఒకటి చేసి లారీని పంపించే మార్గం చూడమని. కాని అరవింద్ స్టేషన్ నిండా ప్రెస్ మీడియా ప్రతినిధులున్నారని లారీలోని లోడు ప్రజా పంపిణీ క్రింద రేషన్ కార్డుదారులకు పంచాల్సిన రాగులని ఇప్పుడు లారీ వదిలితే మన డిపార్టుమెంటుకు చెడ్డ పేరు వస్తుందని మనం డబ్బులు తీసుకొని లోడ్ పంపినట్లు ప్రచారం జరుగుతుందని చెప్పడంతో ఎస్పీ సైలెంట్ అయిపోయాడు. రెవిన్యూ మంత్రి పిఏ కూడా సిఐకి ఫోన్ చేసి సార్ చెప్తున్నాడు “ లారీ మన పార్టీ వాడిదే అంట సారు వదిలేయమంటున్నాడన్నాడు“. అని చెప్పాడు. . అరవింద్

సామరస్యంగానే ఎస్పీకి చెప్పిన మాటే చెప్పాడు అతనికి. అతను గొణుక్కొంటూ ఫోన్ పెట్టేసాడు. ఎస్పీ , మినిస్టరు కూడా యిద్దరు పరిస్థితి చేయిదాటిపోయిందని తామేమి చేయలేమని చెప్పడంతో అబ్బిరెడ్డి పిచ్చికోపంతో రెచ్చిపోయాడు. అంతకోపంలోను జరిగే పని చూడాలని పిఏని పిలిపించి అక్కడున్న పోలీసు సహాయంతో లారీ డ్రైవరుతో మాట్లాడి. అబ్బిరెడ్డి పేరు బైట పెట్టద్దని చెప్పించాడు. దాంతో లారీ లోడ్ అబ్బిరెడ్డిదని చెప్పుకొంటూ వచ్చిన వాడు ఉన్నట్లుండి ప్లేటు ఫిరాయించాడు. పోలీసులు లాఠీ దెబ్బలు రుచిచూపిస్తున్నా వాడు నోరు విప్పలేదు. .

పరమేశాన్నిదెబ్బతీసి రుద్ర వాళ్లను భయపడేలా చేసానని సంతోషపడుతున్న అబ్బిరెడ్డికి లారీ రాగుల లోడ్తో పట్టుబడటం షాక్లా తగిలింది. దాని వల్ల పాతిక లక్షలదాక మట్టి కొట్టుక పోయినందుకు జుట్టు పీక్కున్నాడు. అందుకు కారణమైన రుద్ర, రమణ, అరవింద్ ల అంతుచూడాలనుకొన్నాడు. దానికన్నా ముందు తను తప్పించుకొనే మార్గం చూసుకోవాలని . పిఏకి చెప్పి తెల్లారకముందే చౌక ధర డీలర్లందర్ని పిలిపించమన్నాడు.

చౌకదుకాణ డీలర్లను ఆర్డివో నియమిస్తాడు. ముందుగా ఖాలీలున్న దుకాణాలకు ప్రభుత్వం ప్రకటనలిచ్చి ఆర్డివో కార్యాలయం వద్ద వాళ్లకు పరీక్షలు నిర్వహిస్తారు. తర్వాత ఇంటర్వ్యూ చేసి నియామకాలు చేస్తారు. ప్రకటనలివ్వడం పరీక్షల జరగడం ఇంటర్వ్యూలు చేయడం అంతా జరుగుతుంది. కాని అదంతా ఓ బూటకపుతంతే. ఎంత బాగా పరిక్షరాసినా పాలక పార్టీ వాడికి అది ఎమ్మెల్యే ఎవరికైతే సిపార్సు చేస్తాడో వాడికే చౌకధర దుకాణదారుగా అవకాశముంటుంది. ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే. డీలర్ల పేర్లు సిఫార్సుచేయడంలో అబ్బిరెడ్డి పాత్ర ఉంది. అబ్బిరెడ్డి ఎమ్మెల్యే కాకపోయినా పాలక పార్టీ వాడు కావడంతో అతను చెప్పినవాళ్లకే డీలర్లను ఆర్డివో నియమించడం జరిగింది.

పిఏ చెప్పగానే అందరు వచ్చారు.

వాళ్లు రాగానే “మీకు డీలర్లషిప్పులిప్పిస్తే రాగులు బియ్యం అమ్ముకొంటారా? పార్టికి చెడ్డ పేరు తెస్తారా? ఈ పని ఎవరెవరు సేసింట్రో నాకంతా తెలసు అందర్ని తీసిపారేస్తా ఏమనుకొంటుండారో “ అని వాళ్ల మీద విరుచుక పడ్డాడు.

డీలర్లుకు తెలుసు అబ్బిరెడ్డి తన మనిషి ద్వారా నే ఈ వ్యాపారం చేయిస్తున్నాడని కాని ఎవరు నోరు మెదపలేదు. ఆ రాగులన్ని అబ్బిరెడ్డి మనిషికే అమ్మింది వాళ్లే. ప్రభుత్వం కొత్తగా ప్రజాపంపిణీ క్రింద ఒకో రేషన్ కార్డు వినియోగదారునికి కేజి ఒక్క రూపాయికి లెక్కన మూడు కేజిలు రాగులు ఇవ్వసాగింది. కాని చౌక దుకాణదారు కార్డు వినియోగదారునికి రాగులు ఇచ్చినట్లుగా నమోదు చేసి పదహైదో పదహారుకో అబ్బిరెడ్డి మనిషికి అమ్ముతారు .అతను వాటిని బహిరంగ మార్కెటుకు తరలిస్తాడు. బహిరంగ మార్కెటులో కెజి పైనా రెట్టింపు ఆదాయముండటంతో లక్షలు చేతిలో పడ్తాయి చాలా కాలంగా రేషన్ బియ్యం ,రాగులు, కంది పప్పు, బ్లాక్ మార్కెటుకు చేరవేయడం అబ్బి రెడ్డి చేయిస్తునే ఉన్నాడు..

వాళ్లు నోరు మెదపక పోవడంతో కొద్ది సేపి తిట్టి తర్వాత “ అయిపోయిన్దాని గురించి ఆలోచించడం ఎందుకు పార్టీకి సెడ్డ పేరు రాకుండా సేయండి . ఏం చేయాల్సింది పిఏ చెప్తాడు “ అనేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు అబ్బిరెడ్డి. పిఏ

అందర్ని కూర్చోబెట్టి“ తప్పు ఎవరు చేసినారో వదిలేయండి. ఈ పనంతా గోడౌన్ ఆరై చేసాడని తప్పంతా ఆయన మీదికి తోసేయాల మిగతాది సారు చూసుకొంటాడు. “ అన్నాడు పిఏ.

“ ఆరైని దీంట్లో ఎట్టా ఇరికిస్తాం సార్ అని సందేహం వ్యక్తం “ చేసాడు డీలర్ల నాయకుడు.

“మీ సావు మీరు ఏం సస్తారో మాకు తెలీదు. రాగుల బ్లాక్ మార్కెటు సేసినేది ఆరై అనేటట్లు సేయాలా . అంతే “ అని విసుక్కొన్నాడు పిఏ.

డీలర్లంతా కూడ బలుక్కొని దాని వల్ల తమకొచ్చే నష్టమేమి లేకపోవడంతో అబ్బిరెడ్డి దగ్గర ఇంకా ప్రాపకం సంపాదించుకోవాలని రాగులు బ్లాక్ మార్కెటు చేయడమే కాదు తమకు మిగతా సరుకులు కూడా తూకాలు కూడా తక్కువిస్తున్నాడని సంచి తరుగు ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసేందుకు సిద్దపడ్డారు. ఇక అబ్బిరెడ్డి మిగతా కథ నడిపేందుకు గాను తాము రాగులునిల్వ ఉంచిన ఇంటి యజమాని చేత స్టాకిస్టే ఆ ఇల్లు తన వద్ద గత కొద్ది నెలలుగాబాడుగుకు తీసుకొని రాగులు ,బియ్యం అక్కడ నిలవ చేసేవాడని చెప్పమన్నాడు. ఇక లారీ ఓనర్కుడ్రైవరు క్కూడా రాగులు అక్కడ్నించి స్టాకిస్టు బాడుగకు మాట్లాడుకోవడం వల్ల లారీ లోడ్ ఎత్తినట్లు తమకు అది దొంగలోడని తెలియక పోవడం ఒప్పుకొన్నట్లు చెప్పమన్నాడు. లారీ వెంట ఉన్నవాడు కూడా ఆరైదే ఆలోడు అని ఆరైదని సెప్తే ఆయన ఏం సేస్తాడో నని భయపడి ఏమి చెప్పలేదనికథను అల్లి తను తప్పించుకొనేందుకు స్టాక్ పాయింట్ ఇన్ చార్జ్ను బలిపశువును చేసేందుకు రంగం సిద్దం చేసుకొన్నాడు అబ్బిరెడ్డి.

పది మంది నందిని అది నంది కాదు పంది పంది అంటే అది పందే అయినట్లు ..డీలర్లు, లారీ డైవరు, ఓనరు, లారీ వెంట ఉన్న వాడు, రాగులు నిల్వచేస్తున్న ఇంటి యజమాని చెప్పిన మాటల్తో పాటు ప్రత్యేకంగా రాగులకు తీసిన ఆర్వోలను బట్టి గోడౌన్ సాకిష్టు ఖాదర్ బాషనే డీలర్లకు తెలియకుండా ఆర్వోలు వేసి రాగులు నల్ల బజారుకు తరలిస్తు దొరికిపోయాడని తేల్చేసారు విచారణ అధికారులు. దాంతో రాగులతో సంబంధమే లేని సాకిష్టు సస్పెండు అయ్యాడు.

దాన్ని ఖండిస్తూ తప్పు ఎక్కడ జరుగుతుంది ఎన్నికోట్ల అవినీతి చక్రం చక్కర్లు కొడుతుందో అందులో బడా రాజకీయనాయకుడి పాత్ర ఎంత అని రమణ వివరంగా రాసిన ఆర్టికల్ మరుసటి రోజే పేపర్లో హెడ్ లైన్లలో వచ్చింది . అబ్బిరెడ్డి పేరు ప్రస్తావించకపోయినా చేస్తున్నది అబ్బిరెడ్డి అని అందరికి తెలిసేటట్లు వార్త ఉండటంతో హై కమాండునుండి అబ్బిరెడ్డికి వార్నింగ్ వచ్చింది. లక్షల డబ్బు మట్టికొట్టుకపోవడమే కాకుండా పైనుండి అక్షింతలు పడటంతో అబ్బిరెడ్డి మృగంలా మారాడు. రమణ కనపడకుండా పోయాడు.

పాత పెంకుటిల్లు. గోడలకు వెల్ల వేసి ఎన్ని సంవత్సరాలైందో మరకల మయంగా ఉంది. అక్కడక్కడా సిమెంటు లేచి పోయి ఇటికలు బైట పడి పొడి రాలుతూ, పడిపోవడానికి సిద్దంగా ఉన్నాయి గోడలు. బలం లేని వాకిలి గాలికి కిర్రుకిర్రుమని శబ్దంచేస్తూ ముందుకు వెనక్కి కదుల్తుంది. “ఆ వాకిలికి ఏదన్న అడ్డుపెట్టవేగాలికి కొట్టుకొంటుండాది “. అంటూ లోపల్నించి ఓ గొంతు వినపడింది . “ పెట్టినా నిలబడడంలా “ అంటూ ఓ ముసలామె బైటికి వచ్చి, వాకిలి ముందు నిలబడ్డ రుద్రను చూచి “ఎవరు బాబు నువ్వు?“ అంది. దాంతో “ఎవరు?“ అంటూ బైటికి వచ్చాడు ఓ ముసలాయన. నల్లటి ప్యాంటు పైన టీ షర్టు వేసుకొన్నాడు. నెరిసిన జుట్టుతో , ముఖమంతా ముడతలు పడ్డా దట్టమైన నెరసిన మీసాలు ముఖానికి ఓ దర్పాన్ని తెచ్చిపెడుతున్నాయి. రుద్రను చూసి చూడగానే ,

“రుద్రా ...? . “ అన్నాడతను గుర్తు పట్టినట్లు . తననెప్పుడు చూడక పోయినా తను చెప్పక ముందే పేరు పెట్టి పిల్చినందుకు రుద్ర ఆశ్చర్యపోతుండగా ,

బోసినోటితో నవ్వుతూ భుజం మీద చెయి వేసి లోపలికి తీసుకపోయాడు. ఇంటి బైటికి లోపలకి పెద్ద తేడాలేదు. రెండు చిన్న రూంలు. పరమితమైన సామాన్లు మొదటి రూంలో. పాత కాలం నాటి కుర్చీలు రెండు టేబులు మీద రాసుకొనేదానికి వీలుగా కొన్నికాగితాలు పేపర్లు వాటిపైన లక్కతో చేసిన ఓ మూడుసింహాలబొమ్మ భుజం మీద చేయి వేసి ఆలాగే కుర్చిలో కూర్చో పెట్టాడు రుద్రను. ఆశ్చర్యంల్లోంచి తేలుకోకముందే “టీ ,కాఫీలు లేవు. మంచి నీళ్లేమైనా తాగుతావా? “ అన్నాడు.

“వద్దండి. నేను ...రమణ కోసం వచ్చాను. “ అన్నాడు.

“తెలుసు. రమణ చెప్పాడు .ఏదో ఒక రోజు నువ్వు తప్పక వస్తావని చెప్పాడు. కాని ఇంత త్వరగా నువ్వు రావల్సి వస్తుందని అనుకోలేదు. “

“రమణ ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఉండాది. రెండు దినాలుగా కనపళ్లేదు. మీకేమైనా చెప్పినాడా? యాడికైనా ఎళ్తున్నట్లు. “

“చెప్పలా రుద్రా. కాని అంటుండే వాడు. ఎప్పుడో ఓ సారి మాకు దూరమై పోతానని. అనుకొన్నట్లే కనపడకుండా పోయాడు“. గీరబోతున్న గొంతును అతి కష్టంమీద స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తూ . రమణ తల్లి పైటకొంగుతో ముఖం అడ్డం పెట్టుకొని ఏడుస్తోంది. కన్న కొడుకు ఏమయ్యాడోతెలియక లోలోపల రోదిస్తోంది ఆమె. ఎలా ఊరడించాలో తెలియక “భయ పడకండి రమణకేమి కాదు. వస్తాడు. “అన్నాడు వాళ్లకు ధైర్యం చెప్తూ .

ఆయన బోసినోటితో నవ్వుతూ “భయమా అది వదిలేసినాం బాబు. అలవాటై పోయినాది. ధైర్యం గల కుటుంబమయ్యా మాది. ఎప్పుడైతే నేను సైన్యంలో చేరానో అప్పుడే మా అమ్మనాయన నాగురించి దిగులు పడటం భయపడటం మానేసారు. పెళ్లైయ్యాక భార్యకు అదే ధైర్యం వచ్చింది. బార్డర్లో శత్రు సేనల్తో పోరాడేటప్పుడు నాది అదే ధైర్యం. దాంతో పాటు దేశం కోసం పోరాడుతున్నా మన్న గర్వం. దేశం మాకేమి ఇవ్వకపోయినా దేశానికి సేవచేయాలన్న తపన

మాది మా కుటుంబానిది.నేను దేశం కోసం శత్రుసేనల్తో పోరాడితే నా కొడుకు రమణ దేశం లోపల శత్రువులకోసం పోరాడుతున్నాడని తెలిసి గర్వపడుతునే ఉంటాం. కాకపోతే మేము శత్రుసేనల్ను తురమాడేదానికి తోటి సైనికులు తోడుంటారు ఒంటిరి అన్న భయమేమండదు చస్తే వీర సైనికుడనే గుర్తింపు వస్తుంది. కాని ఇక్కడ ఒంటిరి పోరాటం చేయక తప్పడం లేదు . గుర్తింపు ఉంది పిచ్చోడని, బ్రతకలేనోడని . అయినా ఎవరికోసమో ఇది చేయడంలేదు. దేశ ప్రజల కోసం. వాళ్లను దృష్టశక్తులనుంచి రక్షణ కలిపించే బాధ్యతతో చేస్తున్నాడు నా కొడుకు. బార్డర్లో నేను చేసిన పోరాటానికి వాడిక్కడ చేస్తున్న పోరాటానికి తేడాలేదు. అందుకు గర్విస్తున్నా వాడికి ఏం జరుగుతుందో నన్న భయం ఏ కోశానా లేదు. ఇలాంటి దేదో జరుగుతుందని తెలిసే రంగలోకి దిగినప్పుడు భయమెలా వస్తుంది. “ ఆవేశంగా మాట్లాడుతూ ఉన్నట్లుండి“ అయ్యో మాటల్తో నిన్ను విసిగిస్తున్నానేమో ఎక్కువ సేపు నువ్వు ఇక్కడ ఉండటం కూడా అంత మంచిది కాదు బాబు. నువ్వు వస్తావని నమ్మకం వమ్ముపోలేదు రమణకు. కనపడకుండా పోక ముందు చెప్పాడు తనెవరో వెంటాడు తున్నారని తప్పించుక తిరుగుతున్నాని. అప్పుడే చెప్పాడు తను రాలేక పోతే , నువ్వొస్తే ఈ మెమరీ కార్డు నీకిమ్మన్నాడు. నువ్వు రాక పోతే ....... అయినా వద్దులే నువ్వు వచ్చావు కదా తీసుకెళ్లు .వాటితో ఏమి చేయమన్నాడో అది చెయ్యి. అబ్బిరెడ్డి ఆట కట్టించు. రమణ కోసం ఆలోచించకు. దేశం కోసం పోరాడే వాడికి భయమనేది ఉండకూడదు.ధైర్యంగా నిలబడు వెళ్లిరా జైహింద్ “అన్నాడు.

వాళ్ల దగ్గర కూర్చోని వాళ్లుకు కొద్దిగానైనా ఊరడింపు ఇవ్వాలని మనసలో ఉన్నా అతను చెప్పినట్లు అక్కడ తనుండటం వల్ల తనకే కాదు వాళ్లకు కూడ ప్రమాదమనిపించింది. “మీ కేమైనా సహాయం కావల్సితే తప్పకుండా అడిగండి సార్ నేను మీ అబ్బాయినే అనుకోండి” అన్నాడు. దానికి ప్రతిగా అతను రుద్ర భుజం మీద ఆప్యాయంగా తట్టాడు ఏమి మాట్లడకుండా. అతనిచ్చిన మెమరీ కార్డు తీసుకొని కరచాలనంచేస్తుంటే అతనిల్లొంచి ఏదో శక్తి తనలోకి ప్రవహించినట్లు అనిపించింది రుద్రకు. మాటలు కరువుతుండగా రెండుచేతుల్తో ఇద్దరికి నమస్కారం చేసి వచ్చేసాడు రుద్ర.

తన మీద రమణకు పూర్తిగా నమ్మకం కుదరనట్లుంది. తను అతనింటికి పోతానో పోనో అనుకొన్నాడేమో రమణ. ఒక వేళ పోక పోతే తన తండ్రినే ఆ మెమరీ కార్డులో ఏముందే దాన్ని బైట పెట్టమనిచెప్పినట్లుంది. ఏముంది అందులో అనుకొంటూ మెమరీ కార్డును లాప్టాప్ లో పెట్టి చూసాడు. అది అబ్బిరెడ్డి చేసిన బ్యాంకుల కుంభకోణం గురించి అతను సేకరించిన బ్యాంకు మేనేజర్ ఫోన్లవివరాలు ఏ బ్యాంకులో ఎంత అవినీతి జరిగింది అన్న వివరాలున్నాయి. అసంపూర్తిగా ఉంది. అందువల్ల అతను దాన్ని బైటపెట్టలేదనిపించింది. తను రాలేక పోతున్నందవల్ల అది మరుగున పడిపోకుండా తన చేత కాని, తను వెళ్లకపోతే తన తండ్రిచేతకాని బైట పెట్టించాలనుకొన్నాడు రమణ. అందులో ఫోన్ వివరాలున్నాయి. బ్యాంక్ పూర్తి వివరాలు కావాలంటే మైదుకూరు బ్యాంక్ మేనేజరు సహకరిస్తాడని అందులో నోట్ చేసి ఉండటతో బ్యాంక్ మేనేజరుకు కు ఫోన్ చేసాడు. ముందు మేనేజరు రుద్రకు విషయం చెప్పేందుకు తటపాయించిన రమణ సంగతి

చెప్పడంతో తనే వస్తున్నా అని రుద్ర దగ్గరికి ఓ గంట తర్వాత కంగారు కంగారుగా వచ్చాడు. అతన్ని కూర్చోమని చెప్పి "ముందు రిలాక్స్ అవ్వండి" అన్నాడు రుద్ర. అతను గ్లాసు మంచి నీళ్లు తాగి కొద్ది క్షణాల తర్వాత చెప్పడం మొదలు పెట్టాడు.

"బ్యాంకులో పెద్ద కుంభకోణం జరిగిందని కొద్ది వారాల క్రితం తెలిసింది రుద్రగారు. విషయం పై అధికారులకు తెలిపితే అబ్బిరెడ్డితో నాకు నా కుటుంబానికి ఏలాంటి ముప్పు వస్తుందోనని భయ మేసింది. అలాగని వదిలేస్తే నేను కూడా తప్పుచేసినట్లు అవుతుందని మరో పక్క భయం నన్ను వెంటాడుతుంటే నాకు ఇబ్బంది కలక్కుండా ఆ విషయాన్ని బైట పెట్టేందుకు నేను రమణ సహాయం తీసుకోవాలనుకొని ఆ విషయాన్ని రమణకు చెప్పాను. అతనికి కొన్ని వివరాలు కూడా ఇచ్చాను. ఆ తర్వాత రమణ ఎమయ్యాడో ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. రమణ మీకు విషయం చెప్పాడనగనే మళ్లీ ధైర్యం వచ్చింది. నా పేరు బైట పడకుండా అబ్బిరెడ్డి చేసిన భారీ కుంభకోణాన్ని బైట పెట్టి నన్ను ఈ ఆపదనుండి బైట పడేయండి "అన్నాడు .

తర్వాత కుంభకోణం గురించి చెప్పుకొచ్చాడు.

"మండలంలోని అన్ని గ్రామాల్లో కలుపుకొని దాదాపు వెయ్యి మంది రైతులకు పంటరుణాలు మంజూరు అవుతుంది. ఓ నాల్గు వందలు తప్ప అన్ని రుణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ చేయించుకోకుండా డబ్బు కట్టకుండా ఉన్నా ఆ రైతులకు నోటిసు పంపడం జరిగింది. చాలా నోటీసులు వెనక్కి వచ్చాయి. ఆ పేరు గల మనుష్యులే లేరని. సర్వు అయిన నోటిసులకు సంబంధించిన కొంత మంది రైతులు రెండు రోజులుగా బ్యాంకు మీదికి వచ్చి తమకు ఆ లోనుకు సంబంధం లేదని గొడవ పెట్టుకొంటున్నారు. దీంతో ఇదేదో కుంభకోణం జరిగిందనుకొన్నాను. రికార్డు పరంగా చూస్తే మేము నోటీసు పంపిన రైతుల పాస్ బుక్కులు మా దగ్గరే ఉన్నాయి. అంతే కాకుండా గత మూడు సంవత్సరాల క్రితం మంజూరు అయిన ఇరవై కోట్ల పైచిలుకు లోను రెండు సంవత్సరాలుగా రెన్యువల్ అయ్యింది. రైతులే లేకుంటే రెన్యువల్ ఎలా అయ్యిందో అర్థం కాలేదు. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న నాకు అబ్బిరెడ్డి పిఏ ఫోన్ చేసాడు. నన్ను అబ్బిరెడ్డి రమ్మంటున్నాడని. అతను ఎమ్మెల్యే కాకున్నా అతనికి అధికార పార్టీతో ఉన్న సంబంధముండటంతో విధిలేక పోయానక్కడికి . అతన్ని చూడగానే భయమేసింది, అంత క్రూరంగా ఉన్నాడతను. ఓ పక్క మందుతాగుతూ "నువ్వు కొత్తగా వచ్చిన మేనేజర్ వా నాకాసంగతి తెలియదులే. పాతోడే ఉండాడనుకొని ముందుగా సెప్తాడని తాస్కరం సేసినా సూడూ మీ బ్యాంకులో లోను తీసుకొన్నోళ్లంత మా ఓళ్లే. ఇంగ వోళ్లకు నోటిసులేమి పంపమాక. ఒకేలా ఎవరన్నా నోటిసు పంపినోళ్లు వచ్చినారంటే పొరపాటుగా పంపినామని సెప్పి పంపేయ్. అట్టాగే మీ బ్యాంకులో తీసుకొన్న పైసలు కూడా నేనే కట్టిస్తా. ముందుగా పది లక్షలు డబ్బులు కట్టిపిస్తా. అది ఆ రైతులకు జమసేసి వోళ్లకు లోన్ మళ్లా రెన్యువల్ చేయ్ . రెన్యువల్ చేయగా వచ్చిన పైసల్ను మళ్లా వేరే వోళ్లకు లోను కట్టు వోళ్లకు రెన్యువల్ సేయ్. అట్టా పైసులుకట్టూ రెన్యవుల చేసుకొంటూ వచ్చిన పైసల్ను అట్టా అడ్జస్టు సేసుకొంటూ చేసి మొత్తం ఇరవై కోట్లు రెన్యువల్ చేసుకొంటు పో . ఈ పని నువ్వు ఫ్రీగా

చేయాల్సిన పనిలా ఆఖర్న మిగిలిన పది లక్షలు నువ్వు తీసుకో ఇంతకు ముందు మేనేజర్లు అట్టాగే చేసార్లే నీకేమి కాదు. కాదూ కూడదని తోక తిప్పినా ఇషయం బైట సేరవేసినా నాకేమి కాదు. అంతా మీ వోళ్ల సేసింద్రని నేను తప్పుకుంటా. అంతటితో ఆగేదుండదు. నీ సెవం నీ పెళ్లాం పిల్లలు సెవాలు గూడా దొరకవు మీ వోళ్లకు“ అతనిలో తను చేసిన కుంభకోణం బైట పడుతుందన్న భయం ఏ కోశానా లేదు.

అతని తెలివి, తెగింపు, బెదిరింపులు విన్నాక అంత భారీ కుంభకోణం చేసిన అతను తప్పించుకోకూడదనుకొన్నా కాని అక్కడ పరిస్థితి చూసాక అడ్డంతిరిగే ధైర్యం లేక ఒకవేళ తిరిగినా ప్రయోజనం ఉండకపోగా నేను ఇబ్బందుల్లో పడ్తానని అలాగే చేస్తానని నమ్మబలికి వచ్చేసాను. అబ్బిరెడ్డి మాటల్తో లోను తీసుకొన్నిద రైతులు కాదని గతంలో పనిచేసిన తహశిల్దారును, బ్యాంక్ మేనేజర్లును ప్రలోభ పెట్టి దొంగ పాసుబుక్కులు సృష్టించి అబ్బిరెడ్డి ఈ పనిచేయించాడని తేలిపోయింది. ఎన్నికల ముందు ఏలాగు రుణమాఫీ జరుగుతుందని అంత వరకు అలా రెన్యువల్ చేయిస్తూ పోతే మొత్తం ఇరవై కొట్లు కొట్టేయవచ్చని అబ్బిరెడ్డి ధీమాతో ఆ పని చేయించినట్లుంది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడంలేదు. చేస్తే నేను ముందు ఈ పని చేసిన వాళ్లలాగా ఇరక్కపోతాను. చేయకపోయినా దీన్ని బైట పెట్టినా నా ప్రాణాలకు నా ఫ్యామిలీకి ముప్పు వస్తుందేమో అని భయమేస్తుంది. ఏం చేయాలో దిక్కుతోచక రవణను కలిసి చెప్పాను. అతన్ని ఏం చేసారో తెలియదు. భయంగా ఉంది. పై అధికారులకు చెప్పలేక అబ్బిరెడ్డి చెప్పినట్లు చేయలేక నలగిపోతున్నా... “

బ్యాంకు మేనేజర్ భయపడుతూ చెప్పింది విని ఆవేశంతో రగిలిపోయాడు రుద్ర.

“ఒక్క మండలమలో ఇరవై కోట్లకు పైగా చేస్తే నియోజక వర్గంలోని మిగతా మూడు మండలాల్లో కూడా ఇలాగే చేసి ఉంటడు. ఎంత భారీ కుంభకోణం మిది. ఈ కుంభకోణాన్ని నేను కదిలిస్తా మీరు భయపడమాకండి. నియోజక వర్గంలో మిగతా మండలాల్లో ఉండే బ్యాంక్ మేనేజర్లను బెదిరిస్తే బైటపడతుంది. అది తెలుసుకొన్నాకా మీరు మీ రీజనల్ హెడ్ఆఫీసుకు పర్సనల్గా వెళ్లి మీ పరిస్థితి వివరించండి. అదే సమయంలో ఈ వార్త పేపర్లో మీడియాలోను వస్తుంది. మీరు బైట పెట్టినట్టు ఉండదు. మీ పేరు బైటికి ఎక్కడా బైట పొక్కదు. “ అన్నాడు రుద్ర.

కుంభకోణం గురించి అన్ని ఆధారాలను సేకరించాక దాన్ని పాలక పార్టీకి సంబంధించిన టీవిచానల్స్ కు , పేపర్లుకు కాకుండా మిగతా చానల్స్కు పేపర్లకు అందేలాచేసాక తర్వాత పాలక పార్టీ చానల్స్ పంపాడు రుద్ర అజ్ఞాత వ్యక్తి పంపినట్లే. పేపర్లలోను టీవీల్లోను అది పెద్ద హాట్ టాపిక్ గా మారింది. దాంతో పాలక పార్టీ ప్రకంపనలకు గురైంది. ప్రతిపక్షాల దాడికి తిరగ గొట్టేందుకు దారులు వెదుక్కోవల్సి వచ్చింది. ప్రతిపక్ష పార్టి నాయకులు కొందరు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టులో వేసి రిట్ పిటీషన్ ఆధారంగా సిబిఐ విచారణ ఆరంభించింది. ప్రభుత్వానికి వచ్చిన అపకీర్తి పోగొట్టుకోవాలని లోపాయికారిగా అబ్బిరెడ్డి మీద పెద్ద గా ఆసక్తి చూపనట్లు నటించింది రూలింగ్ పార్టి.

తనను తప్పక అరెస్టు చేస్తారని తెలసి తన అనుచరుల్తో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు రాస్తారాకోలు చేయించి తనంటే ఏమిటో నిరూపించే ప్రయత్నం చేసాడు అబ్బిరెడ్డి, ఆందోళనల మధ్యే . విచారణ నిమిత్తం అబ్బిరెడ్డితో పాటు అతనికి సహకరించిన అప్పటి బ్యాంకు మేనజర్లును, డూప్లికేటు పాస్ బుక్కులు తయారుచేయించి సహకరించిన తహశిల్దార్లు మిగతా సిబ్బందిని అందర్ని కస్టడిలోకి తీసుకొంది సిబిఐ. అబ్బిరెడ్డి జైలుకు వెళ్లగానే రమణ బైటికి వస్తాడనుకొన్నాడు రుద్ర . కాని రమణ తిరిగి రాలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS